క్లుప్తంగా

దుకాణ సముదాయాల ఏర్పాటుకు వేలం



వేలంలో పాల్గొన్న అధికారులు

చెన్నూర్‌రూరల్‌: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో దుకాణ సముదాయాల ఏర్పాటుకు మంగళవారం వేలం నిర్వహించారు. ఇందులో కొబ్బరికాయలు అమ్మేందుకు వేలం ద్వారా రూ.1 లక్ష 11వేలు, లడ్డూ, పులిహోర వేలానికి రూ.1లక్ష10వేలు, నూనె అమ్మకం వేలానికి రూ.3వేలు వచ్చినట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. మొత్తం రూ.2లక్షల 24వేల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. బోనాల చెల్లింపులకు వేలంకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తిరిగి బోనం చెల్లింపుల వేలాన్ని మార్చి 2వ తేదీన నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మోడల్‌జెడ్పీ సమావేశాల ప్రశంసాపత్రాలు

మంచిర్యాలఅర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి, విద్యాశాఖ ఆ.ద్వర్యంలో నిర్వహించిన సురక్షిత మేడారం సమ్మక్క జాతర మోడల్‌ జిల్లా పరిషత్‌ సమావేశం నిర్వహించిన అన్ని పాఠశాలలకు ప్రభుత్వం ద్వారా డిజి టల్‌ ప్రశంసాపత్రాలు ఆన్‌లైన్‌ ద్వారా అందజేయనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, సింగల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ నివారణ, నీటి సంరక్షణ, సహజ వనరుల వినియోగం, పరిసరాల పరిశుభ్రత, అడవుల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కలిగించేలా కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. సైన్స్‌ దినోత్సవం ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలి

నెన్నెల: బెల్లంపల్లి మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం ఇవ్వాలని నెన్నెల మండలం మన్నెగూడం గ్రామానికి చెందిన గోలేటీ సంధ్య కోరారు. బెల్లంపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే వినోద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఎంసీ చైర్మన్‌ పదవీ ఎస్సీకి రిజర్వు కావడంతో మారుమూల గ్రామానికి చెందిన తనకు పదవి ఇస్తే రైతాంగానికి సేవ చేస్తానన్నారు. ఈ ప్రాంత నాయకులు, కార్యకర్తల సూచన మేరకే తాను పదవిని ఆశిస్తున్నానని సంధ్య పేర్కొన్నారు.

'ఫారెస్ట్‌ అధికారుల వేధింపులు ఆపాలి'

మందమర్రిరూరల్‌: చెన్నూర్‌, కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాల్లో అటవీ ప్రాంతాలకు మేత కోసం తీసుకెళ్లే పశువుల కాపరులపై అరెస్ట్‌ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని వెంటనే వారి వేధింపులు ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్‌ చేశారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేత కోసం అటవీ ప్రాంతాలకు మూగ జీవాలను తీసుకెళ్తే మూగజీవాలను అదుపులోకి తీసుకుని బంధించి నోటికి వచ్చినట్లు తిడుతూ రూ.5వేల నుంచి 10వేల వరకు పెనాల్టీ చెల్లించాలని వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని అధికారులు వేధింపులకు గురిచేయకుండా కట్టడి చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు చందు, వెంకటస్వామి, బాపు, సమ్మక్క, నగేష్‌, పోశక్క, కరీమా, యామిని తదితరులు ఉన్నారు.

మహిళా సంఘ సభ్యులకు అవగాహన

మంచిర్యాలటౌన్‌: మున్సిపాలిటీలోని మెప్మా సమావేశ మందిరంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి వైద్య సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫెసిలిటేటర్లుగా కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ రామమూర్తి, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ అల్లాడి శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. బోధకాల నిర్ధారణ కోసం రాత్రి రక్తపూతల సేకరణ, ఆరోగ్య మహిళా క్లినిక్‌లు, తెలంగాణ డయాగ్నోస్టిక్‌(టీ హబ్‌) సేవల గురించి వివరించారు. గర్భిణుల సత్వర నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగితే జరిగే మేలును వివరించి, మార్చి 3న నిర్వహించే పల్స్‌ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా కో ఆర్డినేటర్‌ చంద్రయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సరోజ, సుజాత, అరుణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు బాగుపడేనా..?

- 'సాక్ష్యం' కేంద్రాలుగా మార్పు
- జిల్లాలో 170 ఎంపిక
- ఎంపికైన వాటికి ప్రత్యేక నిధులు

మంచిర్యాలటౌన్‌: జిల్లాలో చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తూ, చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను సాక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాలుగా పిలువనున్నారు. ఇందుకోసం ఇప్పటికే జిల్లాలో సొంత భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఒక్కో ప్రాజెక్టు నుంచి కొన్నింటిని ఎంపిక చేశారు. ఇందులో బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో 279అంగన్‌వాడీ కేంద్రాలుండగా 75ఎంపిక చేశారు. చెన్నూర్‌ ప్రాజెక్టు పరిధిలో 245కేంద్రాలకు గాను 28ఎంపిక చేయగా, లక్సెట్టిపేట ప్రాజెక్టు పరిధిలో 203కేంద్రాలకు గాను 39, మంచిర్యాల ప్రాజెక్టు పరిధిలో 242కు గాను 28కేంద్రాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన మొత్తం 170అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న మౌలిక వసతుల వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. ఎంపికైన ఆయా కేంద్రాలకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేసి ఆధునిక వసతులు కల్పించేందుకు సిద్ధం అవుతున్నారు.

కల్పించే వసతులివే..

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తూ, మధ్యాహ్నం పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు, విద్య కూడా అవసరం. ఉదయం నుంచి సాయంత్రం వరకు అంగన్‌వాడీ కేంద్రాలలోనే ఉండే చిన్నారులకు ఇబ్బందులు ఉండొద్దని ఆయా కేంద్రాలలో మౌలిక వసతుల వివరాలను ప్రభుత్వానికి పంపించారు. విద్యుత్‌ కనెక్షన్‌, స్వచ్ఛమైన శుద్ధజలం అందించే మినీ ఆర్వో ప్లాంట్‌, ఇంటర్నెట్‌ వైఫై కనెక్షన్‌, ఆడియో ప్లేయర్‌, ఆటలు, పాటల బోధన సాగించేందుకు అవసరమైన ఉపకరణాలను అందించనున్నారు. ఇప్పటికే ఆయా వివరాలను ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తే, చిన్నారులు ప్రతిరోజు కేంద్రాలకు వచ్చేందుకు ఆసక్తి చూపించేందుకు అవకాశం ఉంటుందని, వారికి మరింత చక్కని బోధన చేసేందుకు అవకాశం ఉంటుందని ఐసీడీఎస్‌ అధికారులు భావిస్తున్నారు.



పిల్లలను ఆడిస్తున్న అంగన్‌వాడీ టీచర్‌

టౌన్‌ప్లానింగ్‌లో ఇష్టారాజ్యం..!

- ఇంటి అనుమతుల పేరిట డబ్బులు వసూళ్లు
- అటెండర్ల తీరుపై బాధితుల ఫిర్యాదు
- నూతన చైర్మన్‌కు వెల్లువెత్తుతున్న వినతులు
- శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌



రమేశ్‌ యాదవ్‌ నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్‌: మున్సిపాలిటీలో ఇంటి అనుమతుల పేరిట టౌన్‌ప్లానింగ్‌ డిపార్టుమెంటులో పనిచేస్తున్న అటెండర్‌, రెవెన్యూలో పనిచేస్తున్న బిల్‌ కలెక్టర్‌ డబ్బుల వసూళ్లపై నూతనంగా ఎన్నికైన మున్సిపల్‌ చైర్మన్‌ రావుల ఉప్పలయ్యకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో ఇంటికి అనుమతి పేరిట రూ.25వేల నుంచి రూ.5లక్షల వరకు వసూళ్ల పర్వం వెలుగు చూడడంతో, దీనిపై తక్షణమే విచారణ చేసి అందుకు కారకులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, వెంటనే డబ్బులు తీసుకున్న ఫక్రు, ఇర్ఫాన్‌లకు షోకాజ్‌ నోటీసులు జారీ చేయాలని మున్సిపల్‌ కమిషనర్‌ మారుతి ప్రసాద్‌ను చైర్మన్‌ ఆదేశించారు. రోజురోజుకు బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో, విజిలెన్స్‌ అధికారులకు దీనిపై ఫిర్యాదు చేయనున్నట్లు చైర్మన్‌ తెలిపారు. ఇంటి అనుమతులను ఇచ్చేందుకు ప్రభుత్వం టీఎస్‌బీపాస్‌ ఆన్‌లైన్‌ ప్రక్రియను ప్రవేశపెట్టినా, టౌన్‌ ప్లానింగ్‌లో పనిచేస్తున్న అటెండర్‌, బిల్‌ కలెక్టర్‌ వేల రూపాయలను అనుమతుల పేరిట వసూళ్లకు పాల్పడుతుండడం, ఇష్టారీతిన ఇంటి నంబర్లను ఇస్తూ మోసం చేస్తున్నట్లు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. నూతనంగా ఏర్పడిన పాలకవర్గం అవినీతి అక్రమాలపై చర్యలకు దిగడంతో, మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చేందుకు అవకాశం ఉంది.

- మంచిర్యాల పట్టణంలోని రాంనగర్‌కు చెందిన అమరగాని రమేశ్‌ యాదవ్‌ మూడంతస్తులు కలిగిన ఇంటిని కొనుగోలు చేసి, దానిపైన 4, 5అంతస్తులను కట్టేందుకు మున్సిపల్‌ కార్యాలయానికి అనుమతి కోసం వెళ్లినట్లు తెలిపారు. పర్మిషన్‌ కోసం కార్యాలయంలో పనిచేస్తున్న ఫక్రు ఇంటి అనుమతులను ఇప్పిస్తానని, రూ.5లక్షలు తీసుకుని, పర్మిషన్‌ ఇవ్వక పోగా, ఇంటి నంబరుపై అదనపు ట్యాక్స్‌ వేసి రసీదు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదే విషయమై బాధితుడు అప్పటి కమిషనర్‌ బాలకృష్ణను సంప్రదించగా.. ఇంటి అనుమతుల కోసం రూ.15లక్షలు అడిగితే ఇచ్చానని, అయినా తనకు ఇంటి అనుమతి ఇవ్వలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు.
- మంచిర్యాల పట్టణంలోని సప్తగిరి కాలనీకి చెందిన పి.సౌజన్య తన వద్ద మున్సిపల్‌ అటెండర్‌ ఫక్రు రూ.25వేలను తీసుకుని ఇంటి అనుమతి ఇస్తానని తీసుకుని, కేవలం ఇంటి నంబరును వేసి ఇచ్చినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఇలా అదే ఏరియాకు చెందిన మరో ఇద్దరి నుంచి రూ.25వేల చొప్పున వసూళ్లు చేసి, కేవలం ఇంటి నంబర్లను ఇచ్చి మోసం చేసినట్లుగా చైర్మన్‌ దృష్టికి తీసుకెళ్లారు.
- మున్సిపాలిటీలో బిల్‌ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్‌ సైతం ఇర్ఫాన్‌ ఇంటి అనుమతులకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా, ముగ్గురి దగ్గర రూ.15వేల చొప్పున రూ.45వేలను తీసుకున్నాడని ఇటీవలే చైర్మన్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.

పరీక్షలపై భయాన్ని వీడాలి

- డీఈవో యాదయ్య

చెన్నూర్‌: పరీక్షలంటే మనల్ని భయపెట్టడానికి కాదని, మన నైపుణ్యాన్ని ప్రదర్శించే వేదికలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. స్థానిక మైనార్టీ ఫంక్షన్‌ హాల్‌లో చెన్నూర్‌, కోటపల్లి మండలాలలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభ్యాసం చేస్తున్న పదో తరగతి విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పది విద్యార్థులకు రానున్న నెల రోజులు కీలకమన్నారు. విద్యార్థులు పక్కా ప్రణాళికతో సిద్ధమైతే వంద శాతం సాధ్యమవుతుందన్నారు. అవగాహన సదస్సులు జిల్లాలోని అన్ని మండలాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సైకలాజీ ఎక్స్‌పర్ట్‌ బాస్కర్‌, సబ్జెక్ట్‌ ఎక్స్‌పర్టులు, మండల అధికారులు, మున్సిపల్‌ కమిషనర్ల సమన్వయంతో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అత్యుత్తమ ఫలితాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌, మున్సిపల్‌ కమిషనర్‌ గంగాధర్‌, జిల్లా కో ఆర్డినేటర్‌ చౌదరి, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఎంపీవో అజ్మత్‌ అలీ, రెండు మండలాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్షన్‌ లేకుండా పరీక్షలు రాయాలి

జైపూర్‌: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి టెన్షన్‌ పడకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఈవో ఎస్‌.యాదయ్య తెలిపారు. జైపూర్‌ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో మంగళవారం జైపూర్‌, భీమారం మండలాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై ప్రేరణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఎక్కువ మార్కులు సాధించడానికి విద్యార్థులు ఒత్తిడిని జయించే మెలకువలను పాటించాలని పలు అంశాలను నిపుణులు వివరించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్‌ బాలభాస్కర్‌, డీసీఈబీ కార్యదర్శి భీమరావు, సెక్టోరియల్‌ అధికారి చౌదరి, ప్రధానోపాధ్యాయులు దత్తకుమార్‌, ఎంపీవో అనిల్‌కుమార్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో

ఉన్నత లక్ష్యాలతోనే భవిత బంగారు మయం

తాండూర్‌: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని, వాటిని సాధించేందుకు కష్టపడితేనే వారి భవిత బంగారుమయం అవుతుందని ఎంపీడీవో శ్రీనివాస్‌ అన్నారు. మండల కేంద్రంలోని సురభి ఫంక్షన్‌ హాల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్‌ మల్లేశం, జిల్లా సెక్టోరల్‌ సిబ్బంది మూర్తి, తాండూర్‌, అచ్చలాపూర్‌, రేచిని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌, జయప్రకాష్‌, ప్రదీప్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కోటపల్లి: పంచాయతీల్లో నిర్వహించే నర్సరీలపై వేసవికాలంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో భూమన్న అన్నారు. మండలంలోని రాంపూర్‌, దేవులవాడ, లక్ష్మీపూర్‌, వెలమపల్లి, రాపన్‌పల్లి, అన్నారం నర్సరీలను మంగళవారం పరిశీలించారు. వేసవికాలంలో ఎండ వేడిమికి మొక్కలు చనిపోకుండా షెడ్‌నెట్లను ఏర్పాటు చేసుకోవాలని, రెండు పూటల నీటిని అందించాలని ఆదేశించారు. పంచాయతీలకు ఇచ్చిన టార్గెట్‌ ప్రకారం మొక్కలను పెంచేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో అక్తర్‌, కార్యదర్శులు పాల్గొన్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్టు..

దండేపల్లి మండలం గూడెం గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న పంట పొలాలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. నదీ తీరంవెంట కనుచూపు మేరలో సాగు చేసిన వరి పొలాలు భూమికి పచ్చాని రంగేసినట్టుగా ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తోంది. పచ్చని సమాహారంలా చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. - దండేపల్లి



సమాచారం

'పల్స్‌పోలియో' విజయవంతం చేయండి

మందమర్రిరూరల్‌: మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్‌ పిలుపునిచ్చారు. పట్టణంలోని పాత బస్టాండ్‌ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 0–5సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పకుండా పల్స్‌ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రజలకు అందుబాటులో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారి రమేష్‌ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం ఎంపీవో భీరయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

బెల్లంపల్లి మండల సమావేశం

బెల్లంపల్లిరూరల్‌: బెల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహేందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు మూడు నెలల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. సభ్యులు సమయపాలన పాటించాలన్నారు.

రక్త నమూనాల సేకరణ

భీమారం: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో పైలేరియా నివారణ కోసం ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించనున్నట్లు జైపూర్‌ పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ అనీల్‌ తెలిపారు. సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి: కిష్టంపేట నుంచి నీల్వాయికి వెళ్లే 33/11కేవీ విద్యుత్‌లైన్‌ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్‌ తెలిపారు. నీల్వాయి, మామడ, కల్మలపేట, క్యాతన్‌పల్లి, ముల్కలపేట, రాచర్ల, గొర్లపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్‌, మంగెనపల్లి, రాజారాం, ఒడ్డుగూడం, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడం, కళ్లంపల్లి గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పదోతరగతి విద్యార్థులకు అవగాహన

బెల్లంపల్లి: పదో తరగతి విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి మహేశ్వర్‌ రెడ్డి తెలిపారు. ఉదయం 9.30గంటలకు బెల్లంపల్లిలోని సింగరేణి కళావేదికలో సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సుకు బెల్లంపల్లిలో ఉన్న అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు విధిగా హాజరుకావాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టడానికి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇందారంలో సెంట్రల్‌ లైటింగ్‌ పునరుద్ధరించాలని వినతి

జైపూర్‌: మండలంలోని ఇందారం బస్టాండ్‌ నుంచి ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్‌ లైటింగ్‌ పనులను గతేడాది ప్రారంభించినప్పటికీ దానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయకపోవడంతో అవి వెలుగులు వెలగక వృథాగా మారాయని, వాటిని పునరుద్ధరించాలని హెచ్‌కేఆర్‌ సంస్థ మేనేజర్‌ రామకృష్ణకు ఇందారం-2 ఎంపీటీసీ ఆర్నే స్వర్ణసంతోశ్‌యాదవ్‌ మంగళవారం విన్నవించారు. సర్వీస్‌ రోడ్డు, తదితర సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్‌: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్‌ ఓసీలో మేనేజర్‌గా పనిచేస్తూ ఇందారం ఓసీకి బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్లును బీఆర్‌ఎస్‌ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఓసీలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఓసీ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ గోవిందరావు, రక్షణాధికారి రామరాజు, వెల్ఫేర్‌ ఆఫీసర్‌ వంశీ, ఏఐటీయూసీ పిట్‌ కార్యదర్శి ఆంజనేయులు, కౌన్సిలర్‌ రేవెల్లి ఓదెలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

వేమనపల్లి: మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను బుధవారం ఎంపీటీసీ సంతోష్‌కుమార్‌ మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, మాజీ సర్పంచ్‌లు గాలి మధు, రాంచంద్రం, కో ఆప్షన్‌ సభ్యుడు జాహెద్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్‌ బ్యాగ్స్‌ పంపిణీ

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇన్ఫోసిస్‌ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న దుద్దిళ్ల సాయికృష్ణ, వంశీల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, డ్రాయింగ్‌ కిట్లు, స్కిప్పింగ్‌ రోప్స్‌ పంపిణీ చేశారు.

వరి సస్యరక్షణపై అవగాహన

కోటపల్లి: మండలంలోని బోరంపల్లి వరి క్షేత్రాలను ఏవో మహేందర్‌ సందర్శించి కాండం తొలిచే పురుగు, పొట్టదశలో వరిపైరులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. యూరియా వాడకాన్ని రైతులు తగ్గించుకోవాలని సూచించారు. రైతులు అధికారుల సూచనలు పాటించి మంచి దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శేఖర్‌, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

నెన్నెల: మండల కేంద్రంలో భారతీయ రిజర్వు బ్యాంకు సహకారంతో విద్స్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ వెంకటేశ్వర్‌ రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ మేకల మల్లేష్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్‌ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ డిజిటల్‌ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యుత్‌ దీపాలను ఏర్పాటు చేయాలని వినతి

మంచిర్యాలటౌన్‌: పట్టణంలోని 19వ వార్డులో రైల్వే ట్రాక్‌ పక్కన స్ట్రీట్‌ లైట్స్‌ లేని కారణంగా ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, వెంటనే విద్యుత్‌ దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం బీజేపీ నాయకుడు తుల మధుసూదన్‌రావు, కాలనీవాసులు మున్సిపల్‌ చైర్మన్‌ రావుల ఉప్పలయ్యకు వినతి పత్రం అందించారు.

ఆర్థిక సాయం

రామకృష్ణాపూర్‌: పట్టణంలోని కాకతీయకాలనీకి చెందిన నిరుపేద యువతి నీలవేణి వివాహం నిమిత్తం యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. క్యాతనపల్లి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జంగం కళ, తవక్కల్‌ పాఠశాల కరస్పాండెంట్‌ అబ్దుల్‌అజీజ్‌, యువత అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్‌, తిరుపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓసీ ఉద్యోగుల ఆర్థిక సాయం...

స్థానిక ఆర్‌కే4 గడ్డ ప్రాంతానికి చెందిన గుజ్జ సుధాకర్‌ పక్షవాతంతో బాధపడుతుదండగా ఓసీ అధికారులు, ఉద్యోగులు మంగళవారం రూ.18వేల ఆర్థిక సాయాన్ని అందించారు.ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ గోవిందరావు, మేనేజర్‌ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలలోని సమస్యలు పరిష్కరిస్తాం

వేమనపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సమస్యలను ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ సహకారంతో పరిష్కరిస్తామని ఎంపీటీసీ సంతోష్‌కుమార్‌ అన్నారు. పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించగా మూత్రశాలలు లేవని, ఇతర సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, మాజీ సర్పంచ్‌లు, మండల కో ఆప్షన్‌ సభ్యుడు జాహెద్‌ఆలీ, నాయకులు పాల్గొన్నారు.

నేడు భీమారం వైస్‌ఎంపీపీ ఎన్నిక

భీమారం: మూడేళ్లుగా ఖాళీగా ఉన్న భీమారం మండల పరిషత్‌ ఉపాధ్యక్ష పదవికి ఎన్నికల కమిషన్‌ బుధవారం ఎన్నిక నిర్వహిస్తోంది. ఈ మేరకు ఉదయం 11గంటలకు మండల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్యను ప్రభుత్వం నియమించింది. చేకూర్తి సరోజన, పెద్దల రూప ఎంపీటీసీలుగా ఉన్నారు. వీరిద్దరిలో ఎవరిని వైస్‌ ఎంపీపీ పదవి వరిస్తుందో అనేది ఉత్కంఠ నెలకొంది. భీమారం మండలంలో మొత్తం నాలుగు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. చెర్కు దీపికారెడ్డి ఎంపీపీ(భీమారం-2), చేకూర్తి సరోజన(భీమారం-1), పెద్దల రూప (కాజిపల్లి), మద్దికల్‌ ఎంపీటీసీ సమ్మయ్య సర్పంచుగా పోటీ చేసిన సమయంలో ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వలేదని మూడేళ్ల క్రితం అతడిని అనర్హుడిగా ప్రకటించింది. దీంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. కాగా సమ్మయ్య మండల ఉపాధ్యక్షుడిగా ఉండటంతో పదివి ఖాళీ అయింది. అయితే మద్దికల్‌ ఎంపీటీసీ స్థానానికి ఎన్నికలు జరుపకుండా కేవలం వైస్‌ ఎంపీపీ పదవికి ఎన్నికల సంఘం ఎన్నికలను నిర్వహిస్తోంది.

ముగ్గురు హాజరు అయితేనే ఎన్నిక?

మండల ఉపాధ్యక్ష పదవికి జరుగనున్న ఎన్నికలో ప్రస్తుతం ముగ్గురు ఎంపీటీసీలు హాజరైతేనే ఎన్నిక జరుగుతుందని అధికారులు అంటున్నారు. ముగ్గురిలో ఒకరు ప్రపోజల్‌ చేయాలి, మరొకరు బలపర్చాలనే నిబంధన ఉంది. దీనిని బట్టి ముగ్గురు వస్తేనే ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక జరుగుతుంది. లేదంటే ఎన్నిక వాయిదా పడే అవకాశం ఉంది. కాగా కోరంకు సరిపోను ముగ్గురు హాజరైతే చేకూర్తి సరోజన లేకా పెద్దల రూపలో ఎవరికి పదవి వరిస్తోందో అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

బూత్‌ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

తాండూర్‌: బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్‌ విస్తారక్‌ స్వామి కుమార్‌ అన్నారు. బీజేపీ తాండూర్‌ మండల అధ్యక్షుడు రామగొని మహీధర్‌ గౌడ్‌ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమావేశంలో స్వామి కుమార్‌ పాల్గొన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ విస్తారక్‌ తిరుపతి, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్‌ రాచర్ల సంతోష్‌, జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశెట్టి విజయ్‌కుమార్‌, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, కిసాన్‌ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్‌ గౌడ్‌, నాయకులు భరత్‌, శ్రీనివాస్‌, కుమార్‌, మల్లేష్‌, విఘ్నేష్‌ తదితరులు పాల్గొన్నారు.